క్లుప్తంగా

వృద్ధులకు కళ్లజోళ్లు పంపిణీ



మంగళగిరి: రామనాథం చినకోటయ్య, శివపార్వతమ్మల ఆశ్రమంలో వృద్ధులకు చేస్తున్న సేవలు అభినందనీయమని వైఎస్సార్ సీపీ జేసీఎస్ పట్టణ కన్వీనర్ మహ్మద్ ఫిరోజ్ అన్నారు. నగరంలోని రాజీవ్ సెంటర్‌లోని ఆశ్రమంలో ఆదివారం వృద్ధులకు కళ్లజోళ్ల పంపిణీని ఫిరోజ్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు వృద్ధులకు అందిస్తున్న సేవలను కొనియాడారు. ఆశ్రమ నిర్వాహకుడు రామనాథం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

తాడికొండ: రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసిన ఘటన తాడికొండ మండలం కంతేరు గ్రామంలో జరిగింది. వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గుండాల రవితేజ అనే వ్యక్తి 4 బస్తాల రేషన్ బియ్యం తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగార్జున తెలిపారు.

ఉపకార వేతనాలు పంపిణీ

మంగళగిరి: అంజుమన్ ఇ హిమాయతుల్ ఇస్లాం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపకారవేతనాలు పంపిణీ చేయడం ద్వారా ముస్లిం మైనార్టీలలోని పేదలకు విద్యను అందించేందుకు ప్రోత్సహించడం అభినందనీయమని ఎంహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఫరూక్ షబ్లీ కొనియాడారు. నగరంలో అంజుమన్ షాదీఖానాలో ఆదివారం అంజుమన్ ఇ హిమాయతుల్ ఇస్లాం ఆధ్వర్యంలో 669 మంది విద్యార్థులకు ఉపకారవేతనాలు పంపిణీ చేశారు. అంజుమన్ అధ్యక్షుడు షేక్‌అక్రమ్, టీడీపీ నాయకుడు పోతినేని శ్రీనివాసరావు, అంజుమన్ ప్రతినిధులు హనీఫా షా, షేక్ అల్తాఫ్, షేక్ రియాజ్, మహమ్మద్ ఇసూబ్ సాహెబ్, మహమ్మద్ రఫీ, షేక్ రషీద్ సాహెబ్, హనీఫ్ షా ఖాదిరి, అంజుమన్ ట్రస్ట్ బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

వృద్ధ మహిళపై దాడి కేసులో నిందితుడు అరెస్ట్

మేడికొండూరు: వృద్ధ మహిళ దాడి కేసులో ఘటనకు సంబంధించి నిందితుడిని మేడికొండూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈనెల 10వ తేదీన మండల పరిధిలోని భీమినేనివారిపాలెం గ్రామంలోని హైమావతి అనే వృద్ధ మహిళపై దాడి చేసి ఇంట్లో ఉన్న నగదును కొందరు దుండగులు దోచుకెళ్లారు. దీనిపై మేడికొండూరు పోలీసులు దృష్టి సారించి నిందితుడిని ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు...పల్నాడు జిల్లా పిడుగురాళ్లకు చెందిన ఒకరిని గుంటూరు శారదాకాలనీలో ఉండగా మేడికొండూరు పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. గుండ్లపాలెం గ్రామ శివారులోని పెట్రోలు బంకులో ఉన్న సీసీ కెమెరాల పుటేజ్ ఆధారంగా నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు తెలియవస్తోంది. ఈ ఘటనలో ఇద్దరు దాడిలో పాల్గొన్నట్లు, రెండో నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నట్లు తెలిసింది.

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య



తాడికొండ: కుటుంబ కలహాల నేపథ్యంలో వ్యక్తి ఆత్మహత్య చేసుకొని మరణించిన ఘటన తాడికొండ మండలం మోతడక గ్రామంలో జరిగింది. వివరాల ప్రకారం బాపనపల్లి రాంబాబు (46) వ్యవసాయ కూలీగా పనిచేస్తుంటాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో శనివారం రాత్రి వివాదం జరిగింది. ఈ నేపథ్యంలో మనస్తాపం చెందిన మృతుడు పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి బాధితుడు బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగార్జున తెలిపారు.

అధ్యాపకులకు నూతన వస్త్రాలు పంపిణీ

తెనాలిఅర్బన్: బుర్రిపాలెం రోడ్డులోని గుప్తా కళాశాలలో ఆదివారం అధ్యాపకులు, సిబ్బందితో యాజమాన్యం ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ నూకల వెంకట వేణుగోపాలరావు మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలని సూచించారు. అనంతరం దసరా పండుగను పురస్కరించుకుని అధ్యాపకులు, సిబ్బందికి నూతన వస్త్రాలు పంపిణీ చేశారు.



ఫిరంగిపురంలో బాలత్రిపుర సుందరిగా విజయదుర్గామాత



విజయకీలాద్రిపై మహాలక్ష్మి అవతారంలో అమ్మవారు



ఉండవల్లిలో బాలా త్రిపురసుందరి దేవి అలంకారం



బాలా త్రిపురసుందరిగా కొండూరు మహంకాళి అమ్మవారు

బాలా త్రిపుర సుందరీ నమోస్తుతే!

- వైభవంగా ప్రారంభమైన దేవి శరన్నవరాత్రుల మహోత్సవాలు
- పలు చోట్ల ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు

మంగళగిరి: నగరంలో దసరా నవరాత్రి మహోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. భక్తులు నవరాత్రుల సందర్భంగా పెద్ద సంఖ్యలో ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలిరోజు అమ్మవారు నగరంలో వేంచేసి వున్న శ్రీ లక్ష్మీనృసింహస్వామి వారి ఆలయంలో వేంచేసి వున్న రాజ్యలక్ష్మి అమ్మవారు గజలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వగా, భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజ్యలక్ష్మి అమ్మవారికి పట్టణ పద్మశాలీయ బహూత్తమ సంఘం ఆధ్వర్యంలో సంఘ పెద్దలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజీవ్ గృహకల్ప రోడ్డులోని కాళీమాత ఆలయం, పాతమంగళగిరి దుర్గానగర్‌లోని కనక దుర్గ ఆలయం, కోర్టుల వద్ద అమ్మ వారి ఆలయాలలో అమ్మవారు బాలాత్రిపుర సుందరి దేవిగా దర్శనమివ్వగా భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. శివాలయంలో అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్ పర్సన్ నేరెళ్ల లక్ష్మీ రాధిక పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

విజయకీలాద్రిపై మహాలక్ష్మిగా అమ్మవారు..

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి పర్వతంపై వేంచేసియున్న అమ్మవారికి దసరా మహోత్సవాల్లో భాగంగా ఆదివారం మహాలక్ష్మి అమ్మవారి అవతారంలో భక్తులకు దర్శనభాగ్యాన్ని కల్పించారు. ఈ సందర్భంగా శ్రీశ్రీశ్రీ అహోబిల రామానుజ జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాలక్ష్మి అమ్మవారికి నవ కలశ స్నపనం, తిరుమంజన సేవ, మంగళ శాసనం, సహస్ర నామార్చన కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు.

తాడేపల్లిలో...

తాడేపల్లి పట్టణ పరిధిలో వేంచేసియున్న గంగ బాల త్రిపురసుందరీ దేవి, రాజరాజేశ్వరి సమేత త్రిపుర తాండవేశ్వరస్వామి దేవస్థానంలో దేవీశరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి గంగ బాల త్రిపురసుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనభాగ్యం అందించారు. దేవీ నవరాత్రుల సందర్భంగా ఆలయంలో విశేష పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



కాళీమాత ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



రాజ్యలక్ష్మి అమ్మవారికి తొలిపూజ నిర్వహిస్తున్న పద్మశాలీయ బహుత్తమ సంఘం పెద్దలు

ఉండవల్లిలో...

ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లి సెంటర్‌లో గణేష్ యూత్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా అమ్మవారు బాల త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో కుంకుమార్చన కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారని నిర్వాహకులు తెలియజేశారు.

బాలా త్రిపురసుందరి దేవిగా...

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): దేవీ శరన్నవరాత్రులలో భాగంగా ఆదివారం దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీ మహంకాళీ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు శ్రీ బాలా త్రిపురసుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి చినవెంకటరెడ్డి మాట్లాడుతూ శ్రీ శోభకృత్ నామ సంవత్సరం దసరా ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారికి శ్రీ బాలాత్రిపుర సుందరీదేవిగా అలకంరణ చేశామని, భక్తులు అధికసంఖ్యలో దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఫౌండర్ ట్రస్టీ అర్చక స్వాములు తదితరులు పాల్గొన్నారు.



మహాలక్ష్మి అమ్మవారికి చక్రస్నానం చేస్తున్న జీయర్ ట్రస్ట్ వేదపండితులు



బడేపురం భవానీ పీఠంలో బాలా త్రిపుర సుందరి దేవిఅలంకారంలో అమ్మవారు

ఫిరంగిపురంలో..

ఫిరంగిపురం: మండలంలోని పలు ఆలయాల్లో దేవీ నవరాత్రుల సందర్భంగా ఆయా దేవతా విగ్రహాలను ఆదివారం మొదటిరోజు బాలా త్రిపుర సుందరిగా అలంకరించి విశేష పూజలు చేశారు. ఫిరంగిపురంలోని విజయదుర్గాకాలనీలోని అమ్మకు విశేషంగా అలంకరించి అష్టోత్తర, సహస్రనామ పూజలు, కుంకుమార్చనలు అర్చకులు రాజేంద్ర శర్మ నిర్వహించారు. వేమవరంలోని విశాలాక్ష్మి అమ్మను, నుదురుపాడులోని అన్నపూర్ణమాతను అర్చకులు బాలత్రిపురసుందరిగా అలంకరించి అర్చనలు చేశారు. అమీనాబాద్‌లోని మూలాంకురేశ్వరికి అర్చకులు అయ్యన్నశాస్త్రి కుంకుమార్చనలు చేశారు.

బడేపురంలో...

తాడికొండ: దసరా పండుగను పురస్కరించుకొని దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు తాడికొండ, తుళ్లూరు మండలాల్లో ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు అమ్మవారు భక్తులకు బాలా త్రిపుర సుందరీ దేవిగా దర్శనమిచ్చారు. తాడికొండ రామాలయం వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారితో పాటు బడేపురం భవానీ పీఠం పలు గ్రామాలలో అమ్మవారు భక్తులకు బాలా త్రిపుర సుందరీ దేవిగా దర్శనమిచ్చారు.

చిరువ్యాపారికి ఎమ్మెల్యే ఆర్కే చేయూత

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి మహానాడు ప్రాంతానికి చెందిన చిరువ్యాపారికి మంగళగిరి శాసనసభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి ఆర్థిక సహకారంతో టిఫిన్ బండిని ఆదివారం వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా ఎస్టీసెల్ ప్రధాన కార్యదర్శి చిన్నపోతుల దుర్గారావు అందజేశారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ మహానాడు ప్రాంతానికి చెందిన శివలంక రాజేశ్వరి గత 20 సంవత్సరాల నుంచి ఇంటివద్ద టిఫిన్ అమ్ముతూ జీవనం సాగిస్తోందని, ఆమె వ్యాపార అభివృద్ధికి టిఫిన్ బండి కావాలని తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి ఎమ్మెల్యే ఆర్కేను కోరగా స్పందించిన ఆయన టిఫిన్ బండిని అందజేశారని తెలిపారు. రాజేశ్వరికి టిఫిన్ బండిని అందజేసిన వారిలో సచివాలయ కన్వీనర్లు సయ్యద్ సలాం, పల్లంటి ఈశ్వరి, తారక్‌రామ్, ఎస్‌వై నాయుడు, కొండపల్లి శ్రీను, గృహసారథులు కునుకు రామకృష్ణ, చిటికి రెడ్డి స్వాతి, నంద్యాల నాగమణి, సుబ్బయ్య తదితరులు ఉన్నారు.



శివలంక రాజేశ్వరికి టిఫిన్ బండి అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నేత చిన్నపోతుల దుర్గారావు

ఆకట్టుకున్న ఎక్స్‌పో-2023

తెనాలి: పట్టణానికి చెందిన రెయిన్‌బో ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎన్జీఓ కల్యాణమండపంలో ఏర్పాటు చేసిన ఎక్స్‌పో–2023ను రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి అధ్యక్షుడు పావులూరి రాంబాబు ప్రారంభించారు. ఎక్స్‌పోలో తెనాలి, గుంటూరుకు చెందిన మహిళా ఎంటర్‌ప్రెన్యూర్లు వివిధ రకాల ఉత్పత్తులను ప్రదర్శించారు. వీటిలో వెండి, వన్ గ్రామ్, ఫ్యాషన్ ఆభరణాలు, ఆర్గానిక్ ఉత్పత్తులు, చీరలు, డ్రెస్ మెటీరియల్స్, డిష్ వాష్ ఉత్పత్తులు ఉన్నాయి. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకురాలు డాక్టర్ డి.జీవనలత, అసిస్టెంట్ గవర్నర్ కన్నెగంటి మురళీకృష్ణ, కళ్యాణి, వరలక్ష్మి, గాయత్రి, జ్యోతి, అంజుమ్, సృజన పాల్గొన్నారు.



ప్రదర్శనలో వివిధ రకాల ఉత్పత్తులు

వర్ధమాన నర్తకి తహసీన్‌కు మంత్రి రోజా సత్కారం

తెనాలి: పట్టణానికి చెందిన వర్ధమాన నర్తకి షేక్ తహసీన్ తన నృత్య ప్రదర్శనలతో ప్రముఖుల అభినందనలు అందుకుంది. బాపట్ల జిల్లా కొండుభొట్లవారిపాలెంలో శాసనమండలి చీఫ్ విప్ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు సౌజన్యంతో శనివారం ఏర్పాటుచేసిన పూలవనం కార్యక్రమంలో తహసీన్ కూచిపూడి నృత్యాంశాలను ప్రదర్శించింది. ప్రారంభోత్సవానికి విచ్చేసిన రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి రోజా, డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి, తహసీన్‌ను సత్కరించి అభినందించారు. నేటితరం విద్యార్థులు చదువుతోపాటు కళా, సాంస్కృతిక రంగాలపై అభిరుచిని, అభినివేశాన్ని పెంచుకోవాలని ఈ సందర్భంగా మంత్రి రోజా సూచించారు.



తహసీన్‌ను సత్కరిస్తున్న మంత్రి రోజా

అడివి బాపిరాజు కవిత్వంలో ప్రకృతి వర్ణనలు

పాత గుంటూరు: అడివి బాపిరాజు కవిత్వంలో ప్రకృతి వర్ణనలు ప్రత్యేకం అని, అందులో ప్రపంచ ప్రయోజనం కనిపిస్తోందని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వెలువోలు నాగరాజ్యలక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం బ్రాడీపేట ఎస్‌హెచ్‌ఓ సమావేశ మందిరంలో అమరావతి సాహితీ మిత్రులు నిర్వహించిన సభకు యర్రగుంట్ల పాణీరావు అధ్యక్షత వహించారు. ఆమె మాట్లాడుతూ గొప్ప నవల రచయితగా, చిత్రసీమలో గొప్ప కళా దర్శకులుగా విభిన్న రీతులలో అడివి బాపిరాజు కవిత్వం రమణీయంగా రాశారని చెప్పారు. రైతులు, యానాదులు, రకరకాల పీడితుల గురించి ఆయన కవిత్వంలో వివరించారని వివరించారు. ఉమా మహేశ్వరరావు రచించిన 'సిపాయి కథలు' గురించి డాక్టర్ యలవర్తి భవాని వివరించారు. 'ఈ మాసం కవి'గా ప్రముఖ సినీ రచయిత కనగాల జయకుమార్ పాల్గొన్నారు.

బస్టాండ్‌లో కుప్పకూలిన ప్రయాణికురాలు



తెనాలిరూరల్: వైద్యం కోసం తెనాలి వచ్చిన మహిళ బస్టాండ్‌లో కుప్పకూలి మృతి చెందింది. బాపట్ల జిలా భట్టిప్రోలు మండలం ఐలవరం గ్రామానికి చెందిన ప్రత్తిపాటి లక్ష్మి(50) ఆదివారం తెనాలి ఆర్టీసీ బస్టాండ్‌లో మృతి చెందింది. అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె తమ గ్రామం నుంచి తోడికోడలు ప్రసన్న దేవితో కలసి తెనాలి వచ్చింది. పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చూపించుకుంది. తిరిగి మధ్యాహ్నం స్వగ్రామానికి వెళ్లేందుకు ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు కోసం వేచి చూస్తున్నారు. ఇంతలో ఒక్కసారిగా కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందింది. 108 సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి చూసి ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. గుండెపోటుతో మృతి చెందినట్లు భావిస్తున్నారు. ఆస్పత్రిలో చూపించుకునేందుకు తెనాలి వచ్చినట్లు ఆమెతో ఉన్న తోడికోడలు ప్రసన్న దేవి తెలిపారు. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. దీనిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు చెప్పారు.

నేడు పాత ఇత్తడి దిమ్మెలు వేలం

తెనాలిటౌన్: రూరల్ మండలం నందివెలుగులోని శ్రీ అగస్తేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో సోమవారం ఉదయం 10 గంటలకు పాత ఇత్తడి దిమ్మెలు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి తమ్మా శివారెడ్డి, దేవస్థాన కమిటీ చైర్మన్ తన్నీరు వెంకటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయానికి చెందిన 220 కిలోల పాత ఇత్తడి దిమ్మెలను వేలం వేయనున్నట్లు చెప్పారు. వేలం పాటలో పాల్గొనే వారు రూ.ఐదు వేలు డిపాజిట్ చెల్లించి పాటలో పాల్గొనాలని కోరారు.

నేడు చినరావూరుతోటలో మెడికల్ క్యాంప్

తెనాలిఅర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌ను సోమవారం చినరావూరుతోటలోని మథర్ థెరిస్సా స్కూల్‌లో నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. 17వ వార్డు సచివాలయం పరిధిలోని ప్రజలకు ఇక్కడ వైద్య సేవలు అందించటం జరుగుతుందన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మెడికల్ క్యాంప్ కొనసాగుతుందని చెప్పారు.

అబ్దుల్ కలాం సేవలు చిరస్మరణీయం

మంగళగిరి: భారత మాజీ రాష్ట్రపతి, ప్రసిద్ధ శాస్త్రవేత్త డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవలు చిరస్మరనీయమని వైఎస్సార్ సీపీ నాయకులు కొనియాడారు. ఆదివారం అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని నగర పరిధిలోని నవులూరు మక్కెవారిపేటలో కల అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన నాయకులు ఆయన సేవలను కొనియాడారు. నాయకులు ఈపూరి ఆదామ్, దొడ్డక కృష్ణ, షేక్ షఫీ, పులి రామారావు తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాలలో...

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): భారతదేశం గర్వించదగ్గ శాస్త్రవేత్త, మాజీ రాష్ట్రపతి, భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని ఆదివారం దుగ్గిరాల గ్రామంలో ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని, మైనార్టీ నాయకుడు అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సుభాని మాట్లాడుతూ సాధారణ పేపర్ బాయ్ స్థాయి నుంచి మిసైల్ మ్యాన్‌గా, రాష్ట్రపతిగా ఉన్నత శిఖరాలను అధిరోహించి దేశ అభ్యున్నతికి ఎనలేని కృషి చేసిన అబ్దుల్ కలాం చిరస్మరణీయులని అన్నారు. భారతదేశపు అత్యున్నత పౌర పురస్కారమైన భారతరత్నతో పాటు అనేక ప్రతిష్టాత్మక అవార్డులను అందుకున్నారని, ఆయన జీవితం నేటి యువతకు ఆదర్శమని, భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిదాయమని అన్నారు. షేక్ రషీద్ సాహెబ్, షేక్ జాను, షేక్ జాన్‌సైదా, పఠాన్ ఖాదర్, పఠాన్ మస్తాన్, సయ్యద్ జానీ, కాకా వెంకటేశ్వర్లు, ఎల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలీనగర్ ఉర్దూ పాఠశాలలో...

తాడేపల్లిరూరల్: మాజీ రాష్ట్రపతి స్వర్గీయ ఏపీజే అబ్దుల్ కలాంను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని దుగ్గిరాల ఎంపీడీఓ కుసుమ శ్రీదేవి అన్నారు. ఆదివారం దుగ్గిరాల ఆలీనగర్ ఉర్దూ పాఠశాలలో భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కుసుమ శ్రీదేవి మాట్లాడుతూ పేపర్ బాయ్ నుంచి శాస్త్రవేత్తగా ఎదిగి భారతదేశానికి ఎన్నో సేవలు అందించి, దేశ రాష్ట్రపతిగా అబ్దుల్ కలాం పనిచేశారని అన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన నాయకులు



దుగ్గిరాల ఆలీనగర్ ఉర్దూ పాఠశాల వద్ద అబ్దుల్ కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

చెరువులను సాగర్‌నీటితో నింపుకోవాలి

ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లోని చెరువులను నాగార్జున సాగర్ నీటితో నింపుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు చెప్పారు. గుండాలపాడు, రేపూడి రక్షితమంచినీటి చెరువు, కండ్రిక, నుదురుపాడు గ్రామాల్లోని చెరువులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి అవసరాల నిమిత్తం సాగర్ నీరు రెండురోజుల కిందట విడుదల చేశారన్నారు. వాటితో ఫిరంగిపురం, నుదురుపాడు, రేపూడి, శిరంగిపాలెం, 113 త్యాళ్లూరు, మునగపాడు, గుండాలపాడు, బేతపూడి, కండ్రిక, యర్రగుంట్లపాడు గ్రామాల్లోని చెరువులను సాగర్ నీటితో నింపుకోవాలని పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులకు తెలియజేసినట్లు తెలిపారు. గుండాలపాడు గ్రామంలోని చెరువును శుభ్రం చేశారని, సోమవారం చిరుమామిళ్ల మేజర్‌ద్వారా నీరు వస్తుందని చెప్పారు. అదేవిధంగా కొండవీటి మేజర్‌ద్వారా వేపూడి రక్షిత మంచినీటి చెరువును నింపుతున్నామన్నారు. ఆయన వెంట వర్క్ ఇన్‌స్పెక్టర్ సాయి, పలుగ్రామాల సర్పంచులు ఉన్నారు.



రేపూడి చెరువును పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు

ఎస్‌ఆర్‌ఎంలో ఉత్సాహంగా 'ఆలోహ'



జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభిస్తున్న వీసీ మనోజ్



భరతనాట్యం చేస్తున్న విద్యార్థినులు

మంగళగిరి: మండలంలోని నీరుకొండ గ్రామంలో కల ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో ఆదివారం ఆలోహ పేరిట ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా ముగిశాయి. యూనివర్సిటీ మనోజ్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, నాట్యాలు, నృత్యాలు, టగ్ ఆఫ్ వార్, క్లాసికల్, వెస్ట్రన్ డ్యాన్స్, సంగీతం, క్విజ్ పోటీలలో విద్యార్థులు పాల్గొని అలరించారు. యూనివర్సిటీ మిస్, మిస్టర్‌లుగా ధృవ్ నారాయణ్ బజాజ్, వైష్ణవి కస్తూరిలు ఎంపికయ్యారు. స్టూడెంట్స్ అఫైర్స్ డైరెక్టర్ అనిల్ నిగమ్, రేవతి బాలకృష్ణన్, కౌన్సిల్ ప్రెసిడెంట్ ప్రీతమ్, వైస్ ప్రెసిడెంట్ నిరుక్తా, ప్రధాన కార్యదర్శి సంజన, కోశాధికారి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అవయవ దానంపై చైతన్యం తీసుకురావాలి

నగరంపాలెం: అవయవ దానంపై ప్రజల్లో మరింతగా చైతన్యం రావాల్సిన అవసరం ఉందని జీజీహెచ్ సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ అన్నారు. జీజీహెచ్‌లో ఆదివారం సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్, చారిటబుల్ ట్రస్ట్ అఖిల భారత శరీర, అవయవ దాతల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్ష, వైద్యులు ఎస్ఎస్‌వీ రమణ అధ్యక్షత వహించారు. సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఆస్పత్రిలో అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించేందుకు కృతనిశ్చయంతో ఉందని అన్నారు. ఈ క్రమంలోనే లివర్, కిడ్నీ, గుండె మార్పిడి చేసేందుకు గుంటూరు జీజీహెచ్‌ను గుర్తించిందని చెప్పారు. దీనికై అవసరమైన అనుమతులు జారీ చేసిందని పేర్కొన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని ఆరోగ్యశ్రీ ద్వారా అన్ని విధాలుగా సహాయ, సహకారాలు అందిస్తున్నారని అన్నారు. త్వరలో అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో వైద్య రంగాన్ని మరింతగా బలోపేతం చేస్తున్నారని అన్నారు. అవయవ దానం చేసేందుకు ముందుకొచ్చిన 20 మంది దాతలను అభినందించారు. కార్యక్రమంలో అనటామి విభాగాధిపతి సావిత్రి, స్విక్ చైర్‌పర్సన్ జి.సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.



అవయవ దానం కరపత్రాలతో సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్, తదితరులు

అ'పూర్వ' సమ్మేళనం



ఆనాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

తెనాలిటౌన్: పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఉత్సాహంగా సాగింది. రూరల్ మండలం అంగలకుదురులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. పాఠశాలలో 1986–87 బ్యాచ్ విద్యార్థుల హాజరయ్యారు. తమకు విద్యను బోధించిన గురువులు కె.వెంకటప్పారావు, ఎన్.వీరాస్వామి, హరిప్రసాద్, పరంధామయ్య, ధర్మేశ్వరి, హేమలతలతో పాటు ప్రస్తుత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.అనూరాధను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. తాము చదువుకున్న స్కూల్ అభివృద్ధికి పాటుపడాలనే లక్ష్యంతో స్కూల్‌లో విద్యార్థులకు సైకిల్ స్టాండ్ నిర్మాణానికి రూ.మూడు లక్షలు విరాళాన్ని ప్రధానోపాధ్యాయురాలికి అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సూర్యదేవర వెంకట్రావు, జాలాది వెంకటేశ్వరరావు, కనగాల శ్రీధర్, ఎం.రామయ్య, బి.శ్రీను, ఎ.కల్యాణ చక్రవర్తి, ఆర్.సురేష్, జి.పద్మ, ఎం.రాధిక, తులసీరాణి, శేషశ్రీ, కె.సునీత పాల్గొన్నారు.